ప్రచురణకు స్వీకరించిన పోటీ కధానిక :

# *** విషపు మనుషులు ***

"రోహిణి"

రోజూలాగే ఆ వేళకూడా పార్కులో మేం మామూలుగా కూర్చునే చెట్టుకింద కూర్చున్నాం. మేం కూర్చునే చోటుకు ఐదారు గజాలదూరంలో ఉన్న ఎలక్ట్రిక్ స్తంభంపై నున్న ప్రకాశవంతమైన దీపం చెట్టు ఆకుల యొక్కగానీ కూర్చున్న మా యొక్కగానీ క్రీనీడలు పడకుండా అమర్చబడియున్నది. కనుక మేం కూర్చున్న చోట చీమ ప్రాకితే కన్పించేటంత వెలుగు బాగా పడ్తూంటుంది. పార్కులోని లౌడ్ స్పీకరు ఆలిండియారేడియోవారి గ్రామస్థుల కార్యక్రమంపేరిట ఏదేదో విన్పిస్తోంది. దాని గోలలో అది చెప్పుకుపోతుంటే మా గోలలో మేం అనేక విషయాలు పిచ్చాపాటీగా మాట్లాడుకునే పరిపాటి.

చెట్టు మొదట్లోంచి ఓ నత్త గుల్ల మెల్లిగా ప్రాకి మా మధ్యలోకి చేరుకుంది. మేం మాట్లాడుకుంటూనే దాని నడకను గమనిస్తున్నాం. కాసేపు దాన్నలా నడవనిచ్చి నేను గుల్లను పట్టుకుని పైకెత్తాను నత్త గుల్లలోకి ముడుచుకుపోవడానికి ప్రయత్నించి ప్రమాదం ఏం లేదని తెలుసుకున్నట్లు మళ్ళీ మామూలుగా బైటనే వుండిపోయింది. నేనూ చిన్న పుల్లతీసుకుని దాన్ని పొడిచాను. త్వరత్వరగా గుల్లలోకి దూరిపోయింది. గుల్లను నేలమీదికి పెట్టిన కాసేపటికి మళ్ళీ అది పైకి వచ్చి నడక ప్రారంభించింది. దాన్ని మళ్ళీ తియ్యబోయాను. "ఛ వదిలిపెట్టెయ్యండి" అన్నాడు కోటయ్య. "ఇది చూస్తుంటే నాకో సంగతి జ్ఞాపకం వస్తోంది" అన్నాడు చంద్రం.

అంతా అతనివంక చూశాం ఏం చెబుతాడోనని.

"మనిషిని తేలుకుడితే చాలా బాధపడ్తాడు. ఒక్కొక్కప్పుడది చిన్నపిల్లలకి ప్రాణహానికూడా చేస్తుంది. కానీ మనిషిని కుట్టిన తేలు విలవిలా తన్నుకు చావటం నా కళ్ళారా చూచాను" అన్నాడు చంద్రం.

నిజమే. కొందరు మనుష్యుల్ని తేలు కుడితే అదే చస్తుందనీ కొందరు మనుష్యుల్ని పాముకూడా అసహ్యించుకొని పారిపోతుందనీ విన్నాం. కానీ అట్లాంటి దోషి మాలో కూర్చున్న ఒకడు చూచి వుండటం కొంతఆశ్చర్యాన్ని కలగించింది. ఇది నిజమేనా; అంటే, ఆ తేలు అలా విలవిల్లాడుతూ చావటం నువ్వు చూచావా? అన్నట్లు చంద్రం వంక చూచారు అక్కడ కూర్చున్నవారు.

"నిజమే. నేను నా కళ్ళారా చూచాను, మా సూర్యం చిన్నప్పుడే చాలా చెడు తిరుగుళ్ళు తిరిగి ఒళ్ళంతా గుల్లచేసుకున్నాడని మా కందరికీ తెలుసు. త్రాచుపాములా మిలమిలా మెరిసే అతడి శరీరం ఒక్కరాత్రి ఏ స్త్రీని అనుభవించినా ఆరు నెల్లలోగా ఆమె తీసుకు తీసుకు చావాల్సిందే. ఈ విషయం వాడు అంటూంటే ఏదో ప్రగల్భానికి అలాగే అంటాడ్లే అనుకుంటూండే వాళ్ళం. ఓ రోజున మేం అంతా ఇలాగే పార్కులో కూర్చున్నాం. అది వేసంకాలం అనుకుంటాను. ఆ వూళ్ళో తేళ్ళు కొంచెం ఎక్కువ. మా మధ్యలో పెద్ద తేలు కొండి ఎత్తిపెట్టుకుని గిర గిరా తిరిగి నాట్య విన్యాసం చూపించే వట్టువరాలిలా వచ్చి తిరుతోంది. గోపాలం గబుక్కున చెప్పుతీసి దాన్ని చంపబోయాడు. సూర్యం అతడ్ని వారించి "ఆపని నాకు వదులు-చూడండి మీకో తమాషా చూపిస్తా"నని దానిమీదకి చెయ్యి పోనిచ్చాడు. మాకు వళ్ళు గగ్గొర్పొడిచింది, అతడు దాన్ని ఓ జిగినీ గొలుసులా చేతులోకి తీసుకుని ఆప్యాయంగా నిమురుతుంటే, అతని బారినుంచి తప్పించుకోడానికి ఆ తేలు యమయాతన పడ్డది. కుట్టడానికి ప్రయత్నం చెయ్యలేదు కొండి దగ్గర వేళ్లు పెట్టినా కూడా. కాస్సేపు దాన్నలా ఏడిపించి క్రింద వదలిపెట్టాడు, బ్రతుకు జీవుడా అని అది పారిపోడానికి ప్రయత్నించింది. అక్కడున్న వాళ్ళం అంతా ఆశ్చర్యంతో చప్పట్లు కొట్టాం. సూర్యం "అప్పుడే ఆట ముగియలేద"న్నట్లు దాని నడుంమీద వేళ్లు పెట్టాడు. తేలు మర్చిపోయి; దాని అలవాటు కొద్దీ ఆ వేళ్లుమీద చిటుక్కున ఒక్కపోటు వేసింది. సూర్యం నవ్వుతూ దానిమీంచి వేళ్లు తీసేశాడు. అంతా అతని ముఖం వంక చూస్తున్నాం బాధను అణచుకుని పైకి ఊరికెనే ప్రజ్ఞకోసం నవ్వుతున్నాడేమోనని. "వెర్రినాగన్నలూ నా మొహం వంకేం చూస్తారు దాన్ని చూడండి" అని తేలును చూపెట్టాడు. ఆశ్చర్యం అంటె అతకదిక్కడ. ఘోరం అంటే చాలదు. తేలు బాధతో గిరగిరా తిరుగుతోంది. నవనాడులూ కృంగిపోయి కాసేపలా మరణవేదన అనుభవించి చచ్చిపోయింది. సూర్యం నవ్వుతూనే వున్నాడు చిరునవ్వు." చంద్రం తన కథను ముగించాడు. అతడు బడాయికోసం చెప్పినట్లు కనిపించలేదీ కథ. ఇది నిజంగానే జరిగిఉండవచ్చు.

ఇదినిజంగా జరిగినా జరక్కపోయినా ఇదివిన్నాక నాకోవిచిత్ర విషయం జ్ఞాపకం వచ్చింది. దానికీ ఈసంఘటనకు సామ్యం కల్పించి ఆలోచిస్తూ ఉండి పోయాను. పార్కులోని రేడియో ఏమేమో చెప్పుకుపోతోంది. మిత్రులంతా తేళ్ళను గురించీ పాముల్ని గురించీ మనుషుల్ని గురించీ మాటాడుకుంటున్నారు. నాకవేంపట్టటం లేదు నాఊహాలు మరెక్కడో ఉన్నాయి.

* * *

ఉద్యోగరత్యా అవూళ్ళో ఓ రెండేళ్ళుండటం తటస్థించింది. అక్కడి సామాన్యజనంతెనుగు మీరిన వారుకాదు. వెనకబడ్డ ప్రాంతంగా లెక్కలో నమోదైన ఆ ప్రాంతంలో బాగాడబ్బున్న వాళ్ళులేక పోలేదు.

ఆవూరొచ్చిన కొద్దిరోజులకే అక్కడి డిస్పెన్సరీలోని డాక్టరు గారితో బాగాపరిచయం ఐంది. ఇంచుమించు పొద్దస్తమానం ఆయనతోనే గడపటం అలవాటయిందని చెప్పినా చెప్పచ్చు.

ఓ రోజున ఆయన డిస్పెన్సరీలో కూర్చుని పిచ్చాపాటీమాటాడుకుంటున్నాం. రోగులందరికీ మందులిచ్చి పంపేసి తాపీగా కూర్చున్నాడు డాక్టరు మరో కాసేపట్లో ఇంటికి పోదాం అనుకునే సమయంలో ఓ పన్నెండేళ్ళ ఆడపిల్లవచ్చింది. మొలచుట్టూ మొల్తాడూ వోగుడ్డా,దానికో గోచీతప్ప అపిల్ల ఇంకేమీ గుడ్డలు ధరించలేదు. అక్కడి వారికీ మాదిరి మనుషులు వారి దుస్తులు అలవాటే. నాకుకొత్తలో కొంచెం ఎబ్బెట్టుగా కనిపించినా పోను పోను అలవాటైపోయింది, డాక్టరు ఏం జబ్బన్నట్లు అపిల్ల వంకచూశాడు- అది నన్నూ డాక్టర్నుచూసి తలవంచుకుంది. డాక్టరులేచి తెర వెనుకకు వెళ్ళాడు దాన్నికూడారమ్మని. అదివెళ్ళింది బిక్కు బిక్కుమని దిక్కులుచూస్తూ భయం భయంగా.

చాలా కోపంగా మొహంకంద గడ్డలా చేసుకుని బైటికివచ్చాడు డాకరు, ఆపిల్ల బైటికిరాలేదు. కాసేపటికి కోపంతగ్గించుకుని 'ఎవరే అపనిచేసింది' అని గద్దించాడు డాక్టరు. అది బైటికీరాలేదు సమాధానమూ చెప్పలేదు. డాక్టరు విస విసా లోపలికిపోయాడు, ఛెళ్ళుమని గూబవాచిపోయేలా కొట్టినశబ్దమూ "చెబుతావా చెప్పవా వాడిపేరు" అన్నమాటలూ ఒకేసారి వినిపించాయి అది వెక్కి వెక్కి ఏడుస్తూ చెప్పిందాపేరు. నేను నాచెవులనునమ్మలేదు. డాక్టరు మొహం తెల్లకాగితంలా పెట్టుకు బైటికివచ్చాడు, ఒకళ్ళనొకళ్ళం చూచుకున్నాం. తలలు వంచుకున్నాం. నాకంతా అర్థమైంది. అపిల్లచెప్పిన పేరుగల ఆసామీ ఆవూళ్ళో పేరు ప్రఖ్యాతులు గడించిన పెద్ద పెద్ద మనిషి. డాక్టరు కాసేపు చేతులు నలుపుకుంటూ కూచున్నాడు కోపంగానే. తరువాత దానికేదో మందుకలిపిఇచ్చి మళ్ళీ మర్నాడు రమ్మన్నాడు.

'చూశావా ఇలాగుంటాయి ఈపెద్దమనుషుల సంగతులు. అభం శుభం తెలియని ఈ ముండని కాస్తా చెడగొట్టాడు. ఇప్పుడీ రోగం నయంకావాలంటే కనీసం వంద రూపాయల మందులైనా కావాలి ఎక్కడ్నించి తెచ్చిస్తుందిది పోనీ పొమ్మందామా అంటే మనమేదో మందులివ్వక జనాన్ని ఏడిపిస్తున్నట్లు చెడ్డపేరు తెచ్చుకోడమే తప్ప అసలు సంగతి ఎవరికీ తెలీదు' అని కాసేపు ఏదో ఆలోచిస్తూ మౌనంగా ఉండిపోయాడు. "పద పోదాం" అన్నాడు ఉన్నట్టుండి. ఇంటికేనని నేనూ బయల్దేరా. కానీ తీరా అతడా ప్రబుద్ధుడి ఇంటికి దారితీశాడు. అక్కడికీ దోవలో 'ఇదంతా మనకెందుకులే' అని అతడ్ని తప్పించచూశాను కానీ డాక్టరు నే చెప్పింది వినే స్థితిలో లేడు. "ఇలాంటి వార్ని వొదిలిపెడే లాభం లేదు పద. కనీసం దాని మందుఖర్చన్నా భరిస్తాడో లేదో అడుగుదాం" అని నన్నుకూడా లాక్కెళ్ళాడు ఇక అక్కడ జరిగిన సంభాషణా విషయాలన్నీ వివరంగా వ్రాయటం అనవసరం. అతడు ఆ పిల్లరోగం నయం చెయ్యడానికయే మందు ఖర్చంతా భరిస్తాననీ ఈ సంగతి ఎక్కడా పొక్కనివ్వద్దనీ బ్రతిమలాటలోకి దిగాడు చివరకి, మొదట్లో తనకేం తెలీదని బింకాలు పలికినా.

తరువాత తరువాత ఆ పెద్ద మనిషిని గురించిన వివరాలు చాలా తెలియవచ్చాయి. అన్నింటికన్నా ముఖ్యమైనది ఏమిటంటే అతను పెళ్ళిచేసుకున్న ఏడాది మించి ఏ భార్యా బ్రతుకదనీ అలా కనీసం ఆరుగుర్నన్నా తన పొట్టను పెట్టుకున్నాడనీ మళ్ళీ పెళ్ళికోసం అనేక సంబంధాలు వస్తూ పోతున్నాయనీను. కానీ ఇతడు చెడ్డవాడనీ చెడు తిరుగుళ్ళు తిరుగుతాడనీ మటుకు ఎవరూ అనగా నేను వినలేదు. చాలా పెద్ద మనిషిగా చెలామణీ అవటమేగాక పెద్ద పెద్ద పదవులుకూడా అలంకరించి అందరికీ కావలసిన పనులన్నీ అయాచితంగానే చేసిపెడ్తాడనే మంచిపేరుకూడా ఉంది. దానికి తోడు బాగా ఆస్తికూడా ఉన్నవాడవటంతో ఎవరుపడితే వారే తమ పిల్లనివ్వడానికి వెనుకాడేవారుకారట ఇక పెళ్ళైన ఏడాది తిరక్కుండా పెళ్ళాం చచ్చిపోవడమన్నది మొదటి ఒకటి రెండు కేసుల్లోనూ అది వారి కర్మకిందా తరువాత మరేదో కారణం వల్లా మరీ ఆరుగుర్దాకా వచ్చేటప్పటికి అతనికున్న గీతల ప్రభావం క్రిందా చెప్పుకుంటూ వచ్చారేగాని ఈ మనిషి "విష కుంభం" అని అనుకున్న వారెవరూ లేరు.

నోరెరుగని పసిదాన్ని ఆవిధంగా భ్రష్టు పట్టించడంతో డాక్టరుకు పళ్ళుమండిపోయి అతడిమాట వచ్చినప్పుడల్లా విపరీతంగా తిడ్తూండేవాడు.

కొన్నాళ్ళకి డాక్టరుకు ఆ వూరు నుంచి బదిలీ అయిపోయింది. మరికొద్ది రోజులకే నాక్కూడా బదిలీ అయిపోయింది.

ఆ పెద్ద మనిషి కొట్టే వయసులేదు ఇంకా ముప్పయ్యవ పడిదాటలేదు. అందుచేతనున్నూ అతనికున్న ఆస్తిపాస్తులు, పలుకుబడి వల్లనున్నూ మరో పెళ్ళి అవటం ఏమంత కష్టమైన పనికాదు. కొద్ది రోజుల్లోనే ఆ వార్త విన్నాము. ఎవరో బాగా చదువుకున్న అమ్మాయి అతన్ని పెళ్ళిచేసుకోడానికి వప్పుకుందని. అంతే కాదు ఆ పెళ్ళికి నాక్కూడా ఆహ్వాన పత్రిక అందింది. బహుశా డాక్టరుక్కూడా అంది ఉండచ్చు. మామూలు పరిస్థితుల్లో ఎంతో దగ్గర వాళ్ళిళ్ళకే కార్యకలాపాలకు హాజరుకాని నేను ఈ పెళ్ళికి వెళ్ళటానికే నిశ్చయించుకున్నాను. వధువు మెడిసిన్ చదువుతోందిట. పెళ్ళి చాలా వైభవంగానే జరిగింది. డాక్టరుకూడా వచ్చాడు. వీలుచూచుకొని ఇద్దరం అలా షికారుకు బైల్దేరాం చల్లబాటువేళ. ఆ మాటా ఈ మాటా మాట్లాడుకుంటూ కూర్చున్నమేం అసుర సంధ్యవేళకి ఆ వూళ్ళో తిరిగే ఎలుగొడ్ల విషయం జ్ఞప్తికి తెచ్చుకున్నాం.

"ఇక పోదాం, ఇది ఎలుగులు తిరిగే ప్రదేశం. చీకటి పడితే ప్రమాదం" అన్నాను నేను.

డాక్టరు సమాధానంగా ఓ చిరునవ్వు నవ్వి "అవి మనుషులకన్నా నయమే.

(తరువాయి 22 వ పేజీలో)

# విషపు మనుషులు

( 6 వ పేజీ తరువాయి )

మనలోనే ఉన్నాయి ఎలుగుగొడ్లకన్నా భయంకరమైన ద్విపాద జంతువులు, త్రాచు పాములకన్నా ఎక్కువ విషం కక్కుతూ నడిచే సరీసృపాలూను. అన్నట్లు నీకా పిల్ల జ్ఞాపకం ఉందా ?" అని అడిగాడు ఈనాటి పెళ్ళికొడుకు బారిపడ్డ బాలను గురించి ప్రస్తావిస్తూ.

"ఆ. ఇప్పుడాపిల్ల ప్రస్తావన వచ్చింది ?" అన్నాను.

"పద చెబుతాను. ఇందాక అడిగావు కాదూ, ఇతడికి పెళ్ళయిన ఏడాది దాటకుండా భార్యలు చచ్చిపోవడం అనే, కథాచితుగా జరిగే విషయానికి మూఢనమ్మకాలు ఆపాదించి అతడి గీతలో భార్యల్ని పోగొట్టుకునే వాడనే అపవాదు కల్పించారని. ఈ విషయంలో మూఢనమ్మకాల విషయం అలావుంచి నాకో అనుమానం తగుల్తోంది. పద ఆ పిల్ల బ్రతికివుందో చచ్చిందో తెలుసుకున్నాక నీకా సంగతి చెబుతా"నని లేచాడు డాక్టరు,

భోజనాలవేళ ఇంకాకాలేదు. అంచేత అప్పుడే వూళ్ళోకివెళ్ళి ఆపిల్ల విషయం విచారిద్దాం అనుకున్నాం. భోగట్టా చేయగా చేయగా ఆ కుటుంబం ఆ వూరువదలి బ్రతుకుతెరువు కోసం పట్నం వెళ్ళిపోయినట్లు తెలియవచ్చింది. డాక్టరు ఈ వార్తవిని చాలా విచారించాడు అపిల్లబ్రతికి వుందో లేదో తెలుసుకోలేక పోయామే అని. ప్రత్యేకించి ఆ పిల్ల ఆరోగ్యం గురించి ఇద్దరు ముగ్గురు ఆ కుటుంబ సన్నిహితులు (ఇరుగు పొరుగువారు) అనుకున్నవారిని అడిగినా అంత సంతృప్తికరమైన సమాధానం లభించలేదు.

మా సందేహం సందేహంలాగే ఉండిపోయింది.

*   *   *

రాత్రి ఎనిమిది గంటలైంది, "ఇక పార్కులో లైట్లార్పేస్తారు పదండి పోదాం" అంటూ లేచింది మిత్రబృందం. తీరని ఆలోచనలతో మనసంతా కలత జెందిన నాకూ ఆ రాత్రి సుఖంగా నిద్ర పట్టలేదు. కానీ కలలో మాత్రం ఆ పిల్ల అతిదీనంగా ముఖం పెట్టినట్లు, ఏదో పోగొట్టుకున్నట్లూ ఏమీ కనిపించలేదు, కలత నిద్రతో గడిచిపోయిందా రాత్రి.

తెల్లవారింది, కాలకృత్యాలు తీర్చుని ఆఫీసుకు వెళ్ళాను, టేబిలుమీద ఒకే ఒక ఉత్తరం నాకు ఎడ్రసు చేసివుంది దానిమీద చాలా పోస్టు ముద్రలున్నాయి. బహుశా అది చాలా చోట్లకు చాందాయణంచేసి వుండవచ్చు, పోయిన చోటల్లా పోస్టు ముద్ర వేయించుకుని చివరికి గమ్యస్థానం చేరింది. కవరు చించి ఉత్తరం వ్రాసిన తేదీ కోసం చూచాను. అది మా డాక్టరు మిత్రుడి దగ్గర్నుంచి, అతగాడికి జాబులమీద తేదీలు వేసే అలవాటులేదు. అది ఎన్నాళ్ళక్రితం వ్రాసిందో ఇతమిద్ధంగా చెప్పడం కష్టం. సంబోధన ఉభయకుశలోపరి అయినాక ఆ జాబు ఈ క్రింది విధంగా సాగింది.

"నీకు (ఫలానా) గారూ ఆయన తాలూకు పెళ్ళిళ్లూ వగైరా విషయాలు జ్ఞాపకం వస్తున్నాయనుకుంటాను. అతగాడి చివరి పెళ్ళినాడు మనిద్దరం ఎలుగుబంట్ల కొండమీద కూర్చుని అతడు రోగాలపాలు చేసిన పిల్లదాన్ని గురించి వాకబు చేద్దాం అనుకున్నాం. ఊళ్ళో విచారిస్తే సరైన ఖబురు తెలీలేదు. కొన్నాళ్ళక్రితం నేను విశాఖపటణంలో కె. జి. హెచ్. (కింగు జార్జి హాస్పిటల్)కి వెళ్ళటం తటస్థించింది. అక్కడో డాక్టరు మిత్రురాలు కనించింది. ప్రసంగవశాత్తూ దురదృష్టవంతురాలైన ఆ పిల్ల సంగతి వచ్చింది. ఆమె చచ్చిపోయిందిట హాస్పిటల్లో. మరో విషయం చివరిసారిగా పెళ్ళయిన ఆఅమ్మాయీ(ఏడవ భార్య అనుకుంటాను) అతనుకూడా చచ్చిపోయారట ఈ ఆఖరి భార్య విషకన్య (తొడ పాము వగైరాల్లాంటి దుర్లక్షణాలు. కలది) అనే విషయాన్ని కప్పిపుచ్చి పెళ్ళి చేశారట. పెళ్ళయిన కొన్నాళ్ళకే అతడు చనిపోయాట్ట. మరో కొన్నాళ్ళకు ఆమే చనిపోయిందిట. ఈ విషయాలను నాకు చెప్పిన డాక్టరు మిత్రురాలు పిల్లతరపు బంధువు. నేనా వూళ్ళో కొన్నేళ్లు పనిచేయటం తెలిసిన ఈమె అతడ్ని గురించిన నా అభిప్రాయాన్ని తెలుసుకుందామని ఈ ప్రస్థావన ఎత్తింది. ఆమె బంధువు అయిన (అతడి ఆఖరి భార్య) గురించిన "విష" ప్రచారం సంగతి ఎంత వరకూ నిజం అని అడిగాను. ఆ విషయంలో తనకంతగా ఏమీ తెలీదని చెప్పింది, అప్పుడు నేను మనం మందిచ్చిన పిల్లసంగతి చెప్పాను. అప్పుడామె జ్ఞాపకం చేసుకుని ఆ పిల్ల విక్టోరియా హాస్పిటల్లో చచ్చిపోయిందనీ ఆమె రోగం ఎవరికీ అర్థం కాలేదనీ మొత్తంమీద విష ప్రయోగంలాంటిదేదో జరిగి రక్తం గుర్తు పట్టడానికి (ı) వీల్లేకుండా చెడిపోయిందనీ చెప్పింది. ఆమె పిల్ల చావుకీ, (తెలిసి ఉన్నా) ఏడుగురు (తెలీకండా మరెంతమందో) భార్యల చావుకీ అతడిలో జీర్ణించుకుపోయిన విషయాలెందుకు కారణంకాకూడదని అడిగాను. ఆమె అయితే అవచ్చు నంది.

మూఢ నమ్మకాల వెనకా అర్థంలేని సంఘపు కట్టుబాట్ల వెనకా ఎంతమంది ఇలాటి విషపుమనుషుల బారికిగురై మూగపాలౌతున్నారో. ఈ విషయాల్లో నీకాసక్తి వుంటుందనే ఉద్దేశ్యంతో వ్రాస్తున్నాను." అంటూ జాబు ముగించాడు డాక్టరు మిత్రుడు. నేను ఆ జవాబు చదువుతూంటే మెల్లిమెల్లిగా ఒక్కొక్కరే జేరారు నా బల్లచుట్టూ మిత్రులంతా. "ఏమిటంత తీక్షణంగా చదువుతున్నారా ఉత్తరాన్ని" అని అడిగాడు చంద్రం. చదవమన్నట్టు ఉత్తరం అతని కందించాను. ఒక్కొక్కరే అంతా చదివారా ఉత్తరాన్ని.

"ఉంటారు విషపు మనుషులు" అన్నాడు కోటయ్య.

అందులో అనేకరకాలు. ఈ రకం భౌతికంగా హానికలిగించేది. కాగా మానసికంగా కాటువేసి కొంపలు కూల్చగలవారు. మరి కొంతమంది వుంటారు, వాళ్ళతో మరీ డేంజరు అన్నాడు అప్పయ్య.

—:O:—